క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 80, పచ్చిమిర్చి100, బెండ 45, కాకర 60, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 70, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ముల క్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొర కాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 160.

గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా జేమ్స్ బాబు



గచ్చిబౌలి: గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బి.జేమ్స్ బాబు బాధ్యతలు చేపట్టారు. సోమవారం సీఐ సురేష్ నుంచి జేమ్స్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

27న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్టు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 కేంద్రాల్లో 3 శిబిరాలను ఉదయం 9:30 గంటల నుంచి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం, లేబర్ ఆఫీసు కార్యాలయాల్లో.. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి సంగారెడ్డి శాంతినగర్‌లోని విద్యుత్ కార్యాలయం, మెదక్ జిల్లాకు సంబంధించి కలెక్టరేట్ కార్యాలయంలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శంకరంగౌడ్, ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. సోమవారం రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ విశ్వేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకరంగౌడ్, రాములు మాట్లాడుతూ పెన్షన్‌దారులకు ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని కోరారు. అందుకు మూలవేతనం నుంచి ఒక శాతం నిధులు ఇచ్చేందుకు పెన్షన్‌దారులు సిద్ధమని వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

పశువుల అక్రమ తరలింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జహీరాబాద్ నుంచి నగరంలోని ముషీరాబాద్ ప్రాంతానికి మూడు వాహనాల్లో తరలిస్తున్న 14 గేదెలు, 5ఎద్దులను రామచంద్రాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లావారుజామున ఇక్రిశాట్ వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో పట్టుకున్నారు. పశువులను కూకట్‌పల్లిలోని గోశాలకు తరలించారు.

ఒత్తిడి, భయాన్ని అధిగమించడానికి 'జియో జీ భర్ కే'

నిజాంపేట్: సుఖమయ జీవితానికి జియో జీ భర్ కే ఉపయోగ పడుతుందని కోచ్ రాజశేఖర్ అన్నారు. సోమవారం ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో 22 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా, అన్ని విషయాలను ఆస్వాదిస్తూ, హుందాగా, ఆనందంగా జీవితాన్ని కొనసాగించడం కోసం రూపొందించిన ఆచరణాత్మక కోచింగ్ ×జియో జీ భర్ కే'కు సంబంధించి డెమో ఇచ్చారు. ఒత్తిడి, విరక్తి, భయం, భ్రమ, అహంకారం, అపోహలు, అసూయ, కలతలు, గతం, అలసత్వం, నిరాశలను అధిగమించడానికి ఈ కోర్స్ దోహద పడుతుందన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ శ్రీనివాసరావు



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ నిజాంపేట్ రోడ్డులోని సంఘమిత్ర స్కూల్ వద్ద చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా?

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. వేలాడుతున్న విద్యుత్ వైర్లు

శేరిలింగంపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా అదేస్థాయిలో పెరిగింది. ఉన్నవాటికే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఇక వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. శేరిలింగంపల్లిలోని తారానగర్, బాపూనగర్, లింగంపల్లి, ప్రశాంత్‌నగర్, దూబే కాలనీ, డోయన్స్ టౌన్‌షిప్, సుదర్శన్‌నగర్- ఆలిండ్ హౌసింగ్ సొసైటీ, హుడా ట్రేడ్‌సెంటర్ కాలనీ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. పిల్లర్‌పై ఉంచడంతో విద్యుత్ వైర్లు యమపాశాల్లా వేలాడుతున్నాయి. ఈ వైర్ల వల్ల ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో బాటు వైర్లు వేలాడకుండా చేయాలి
- ఫ్యూజుబాక్సులకు మూతలు ఏర్పాటు చేయాలి
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దోయన్స్ టౌన్‌షిప్‌లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



శేరిలింగంపల్లి బాపూనగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద..



సుదర్శన్‌నగర్- ఆలిండ్ హౌసింగ్ సొసైటీ పార్కు పక్కన..



లింగంపల్లి రైల్వే స్టేషన్- 6వ ప్లాట్‌ఫారం రోడ్డుపై..



దూబే కాలనీ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లు

సీఎం కాన్వాయ్‌కు ఘనస్వాగతం



పటాన్‌చెరులో కాన్వాయ్‌లో నుంచి అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

పటాన్‌చెరు: మహారాష్ట్ర పర్యటనకు బయలుదేరిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు పటాన్‌చెరులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కేసీఆర్ కాన్వాయ్‌పై పూలు చల్లి తమ అభిమానం చాటుకున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయనతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మహారాష్ట్ర పర్యటన వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతాంగానికి అండగా నిలవాలన్న ఉన్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌ను విస్తరిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్‌దే విజయం

పటాన్‌చెరు టౌన్: రాబోయే ఎన్నికల్లోమళ్లీ బీఆర్ఎస్‌దే విజయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సీఎం కేసీఆర్ మహారాష్ట్రలో నిర్వహించనున్న సభకు భారీ కాన్వాయ్‌తో వెళ్తున్న సందర్భంగా పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో సోమవారం నీలం మధు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ కీలక నేతగా తనదైన ముద్ర వేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల చూపు బీఆర్ఎస్ వైపే ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

'డ్రగ్ ఫ్రీ సొసైటీ' లక్ష్యంగా సాగాలి



కేంద్రీయ విద్యాలయలో ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే కార్యక్రమంలో విద్యార్థులు వేసిన పెయింటింగ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్

రాయదుర్గం: 'డ్రగ్ ఫ్రీ సొసైటీ' ఏర్పాటే లక్ష్యంగా సాగాలని కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ సూచించారు. డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే'తో గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై పెయింటింగ్స్, స్లోగన్స్, డిబేట్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్స్, స్లోగన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విద్యాలయ లైబ్రేరియన్ శివకృష్ణశాస్త్రి, పీజీటీ హిందీ అపర్ణా, ఇంగ్లిష్ పీజీటీ వందన మనహస్ పర్యవేక్షించారు.

బాల గాన గంధర్వులు సీజన్-3 విజేతగా కీర్తన



విజేతలతో సింగర్ రేవంత్

బంజారాహిల్స్: ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంకు నివాళిగా నగరంలోని మొట్టమొదటి మ్యూజిక్ రేడియో స్టేషన్ మ్యాజిక్ 106.4 ఎఫ్ఎం ఆధ్వర్యంలో బాల గాన గాంధర్వులు సీజన్-3 పోటీలు నిర్వహించారు. కొండాపూర్‌లోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్ వేదికగా జరిగిన ఈ పోటీ గ్రాండ్ ఫినాలే అద్భుతంగా వీనుల విందుగా కొనసాగింది. ఇండియన్ ఐడోల్-9 విన్నర్ ప్రముఖ గాయకుడు రేవంత్, సాహితీ చాగంటి, ధనుంజయ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బాలూ జయంతి రోజు ప్రారంభించిన ఈ సంగీత పోటీల్లో వందల మంది ఔత్సాహిక బాల బాలికలు పాల్గొని తమ ప్రతిభనుచాటుకున్నారు. 15 ఏళ్లలోపు బాల బాలికలు పోటీ పడగా వారిలో టాప్-5 సింగర్స్‌ను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. చిన్నారులంతా బాలూ పాటలతో ఆద్యంతం అలరించారు. ఈ పోటీల్లో కీర్తన విన్నర్‌గా నిలవగా ఉజ్వల్, సాహితీ రెండో రన్నరప్‌గా నిలిచారు. కార్యక్రమానికి ఆర్‌జే నాని, ఆర్‌జే రవళి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

నిరంతర అభ్యాసంతోనే గెలుపు

క్యాప్రికాట్ టెక్నాలజీస్ ప్రొడక్ట్ మేనేజర్ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే నిరంతర అభ్యాసం ముఖ్యమని, అప్పుడే కొత్త నైపుణ్యం, జ్ఞానం అలవడతాయని క్యాప్రికాట్ టెక్నాలజీస్ ప్రొడక్ట్ మేనేజర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'మెషిన్ లెర్నింగ్-ఇట్స్ అప్లికేషన్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ'పై మూడు రోజులపాటు జరిగే అధ్యాపక వికాస కార్యక్రమం సోమవారంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం 6 నెలల్లో మారిపోతోందని, కొన్నిసార్లు పూర్తిగా కొత్తదనం సంతరించుకుంటోందన్నారు. ఐదేళ్లకోసారి కొత్త సాంకేతిక వస్తోందని, దానిని ఆది నుంచి నేర్చుకోకపోతే విద్యార్థుల ముందు నిలబడటం కష్టమవుతుందని అభిప్రాయపడ్డారు. రోబోటిక్ పరిజ్ఞానంతో రూపొందించిన టిక్-టాక్-టో గేమ్‌ను మంగళవారం కార్యక్రమంలో ప్రదర్శిస్తామన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎస్.సీతారామయ్య, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి పాల్గొన్నారు.

'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు
- కాంగ్రెస్ పార్టీలో చేరికలు

హఫీజ్‌పేట్: 'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం పీసీసీ ప్రతినిధి సత్యంరావు పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి, త్వరలో మొదలు కాబోతున్న 'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని పార్టీ నాయకత్వానికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొండాపూర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీలోని యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ సత్యంరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై పార్టీలో వస్తున్నారన్నారు. కార్యక్రమంలో భరత్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



ఆర్ఐ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

శేరిలింగంపల్లి: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలని తహశీల్దార్‌ను శేరిలింగంపల్లి మండల ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు సోమవారం కోరారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని నిరుపేదలు డబుల్ ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్నారని మండల పరిధిలోని గుల్ మొహర్‌పార్కు కాలనీలో నిర్మాణాలు పూర్తి అయినందున అర్హులైన వారికి వాటిని కేటాయించాలన్నారు. అదే విధంగా మండల పరిధిలోని మియాపూర్, గోపన్‌పల్లి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాల పాలవుతోందని, ఆయా భూములను ఇళ్ళులేని వారికి 60 గజాల చొప్పున కేటాయించాలని కోరారు. ఈ యేరకు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కొంగరి కృష్ణ, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు శ్రీనివాస్, శంకర్, సేవ్యా రాథోడ్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం

- డ్రైనేజీ సమస్యతో ప్రజలు సతమతం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్



ప్రజాయాత్రలో కరపత్రాలు అందజేస్తున్న రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని, చందానగర్ సర్కిల్‌లో ప్రజా సమస్యలు అధికారులకు పట్టడంలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ విమర్శించారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్, కొండాపూర్ వీకర్ సెక్షన్, భిక్షపతినగర్, శిల్పాపార్క్‌లో ప్రజాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కొండాపూర్ వీకర్ సెక్షన్, భిక్షపతినగర్‌లో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ యాదవ్, మధుయాదవ్, ప్రసాద్, యాదయ్య, కృష్ణ గౌడ్, పద్మ, నరేష్, శివ, గోపాల్, పార్వతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్: డివిజన్ పరిధిలోని వీడియో కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, చిరంజీవినగర్ కాలనీలో 23వ రోజు గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అధికార పార్టీ నాయకులు సమస్యలను గాలికి వదిలేసి చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై పడ్డారని ఆరోపించారు.

మూసాపేటకు మరో వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలి



మూసాపేట: మూసాపేట డివిజన్‌లో మరోక వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని సోమవారం కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ జెడ్సీ మమతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డు పరిపాలన కార్యాలయం మోతీనగర్‌లో ఏర్పాటు చేయడంతో మూసాపేట, మారుతినగర్, ముష్కిపేట్, జనతానగర్, వడ్డెర బస్తీ, ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, జిల్లా బస్తీ, ఇడబ్ల్యూయస్ భరత్‌నగర్, యాదవ బస్తీ, బాబూ గజ్జీవన్‌రామ్ బస్తీ, మహేశ్వరి నగర్, శక్తి నగర్‌లలో నివసించే వారికి దూరం అవుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలు తెలియజేయటానికి దూరభారం అవుతుందని పేర్కొన్నారు. ముష్కిపేట్‌లో అందుబాటులో ఉన్న వార్డు కార్యాలయాన్ని ఈ కాలనీవాసులకు అందుబాటులో ఉండే విధంగా మూసాపేట డివిజన్‌కి మరొక నూతన పరిపాలన వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్, మూసాపేట రెండు భాగాలు వేరుగా ఉండటం వల్ల అక్కడ వార్డు కార్యాలయం ఉన్నందున వారి సమస్యలు అక్కడున్న వార్డు కార్యాలయంలో తెలియజేస్తారన్నారు.

లారీ బోల్తా.. ట్రాఫిక్‌జామ్



రోడ్డుపై అడ్డంగా పడ్డ బండరాళ్ళు

మాదాపూర్: భారీ బండరాళ్ళను తీసుకువెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొనడంతో బండరాళ్ళు రోడ్డుపై పడి ట్రాఫిక్ జాం అయిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ సైబర్‌టవర్ నుండి కేపీహెచ్‌బీ కాలనీ దారిలో ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం రాత్రి లారీ డివైడర్‌ను ఢీ కొని బోల్తాపడింది. దీంతో బండరాళ్ళు పడిపోవడంతో ప్రధాన రహదారి కావడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు డ్రైవర్ గణేశ్ సాహుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

భాగ్యనగర్‌కాలనీ: మానసికస్థితి బాగా లేని మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి. గోపాల్, భార్య పెంటమ్మ(45)తో ఇంద్రనగర్‌లో నివాసం ఉంటున్నాడు. గోపాల్ 24వ తేదీ ఉదయం 9గంటలకు ఆఫీసుకు వెళ్లి రాత్రి 8గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో భార్య ఆచూకీ కోసం పరిసరాల్లో వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



దివ్య(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వివాహిత మృత చెందింది. పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన దివ్య(18)ను అదే రాష్ట్రానికి చెందిన వికాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. బతుకుదెరువు కోసం మండల పరిధిలోని ఇస్నాపూర్‌కు వచ్చి అద్దెకు ఉంటున్నారు. వికాస్ డీమార్ట్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన వికాస్ ఎప్పటిలాగే పనికి వెళ్లగా మధ్యాహ్నం అతని భార్య దివ్య ఫోన్‌చేసి ఇంటికి రమ్మని చెప్పింది. దీంతో వికాస్ ఇంటికి వెళ్లేసరికి ఎలుకల మందు తాగానని చెప్పడంతో ఆమెను వెంటనే పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి దివ్య చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రాధాగజనాన్ తన కూతురు ఆరోగ్య పరిస్థితి సరిగాలేక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

24 మందికి కొవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం 24 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదు



కూకట్‌పల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కూకట్‌పల్లి మండల కార్యాలయం వద్ద నాయకులు మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకుడు ఎం. శంకర్, సీఐటీయూ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కే. కృష్ణనాయక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు ఏ. రంగారెడ్డి, లక్ష్మీపతిరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజేష్, మహిళా సంఘం కార్యదర్శి ప్రమీల పాల్గొని మాట్లాడారు.

- ఎన్ని ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, పేదల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. తెలంగాణ వస్తే ప్రజల బతుకులు మారుతాయని ఎన్నో ఆశలతో ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు.
- ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 17 జిల్లాల్లో 61 కేంద్రాల్లో లక్షలాది మంది పేదలు గుడిసెలు వేసుకొని కొన్ని నెలల నుంచి అక్కడే ఉంటున్నారని ,వారికి పట్టాలు ఇవ్వకపోగా వారిపై పోలీసులు, రౌడీలతో దౌర్జన్యం చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని కోరారు. వారికి అండగా ప్రజా సంఘాల నాయకులు ఉంటారని పేర్కొన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని మండల కార్యాలయాల్లో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు బస్సు జాత నిర్వహిస్తున్నామన్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌లు, గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షల ఇవ్వాలని.. బీసీ రుణాలు లక్ష వెంటనే మంజూరు చేయాలని.. వికలాంగ, గిరిజన, దళితబంధు వెంటనే అమలు చేయాలని.. పెన్షన్, రేషన్ కార్డులతో పాటు ఆదాయ సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్మారావు, రాములు, స్వామి, శ్రీనివాస్, రాజు, సాయిరెడ్డి, గంగారెడ్డి, లక్ష్మి, చిరంజీవి, రంజిత్, శ్రీను, నాగమణి పాల్గొన్నారు.